# వేగంగా... సులభంగా గరిష్ఠ మార్కులు!

ప్రశ్నల్లో ఇచ్చే వివిధ నిర్దేశకాలకు సమాధానం ఏ తీరులో ఇవ్వాలో గ్రహించాలి. ఉదాహరణలతో సాధన చేయాలి. ఎన్ని ఎక్కువ టాపిక్‌లతో సాధన చేస్తే అంత ఎక్కువ ఉపయోగం!

పరీక్షల్లో ఇచ్చే ప్రశ్న చదివాక అందులో ప్రధాన భాగాలైన ప్రశ్నాంశం, నిర్దేశకాలు (డైరెక్టివ్)లను గుర్తించాలి. ప్రశ్నాంశంలోని ముఖ్యాంశాన్ని కొన్ని కీలక పదాలు చెబుతాయి. అవి 'కంటెంట్ వర్డ్స్'. మన సమాధానానికి ఏయే భావాలు, అభిప్రాయాలు, సిద్ధాంతాలు పునాదిగా ఉండాలో, ఏ అంశంపై ప్రధానంగా కేంద్రీకరించాలో ఇవి సూచిస్తాయి. కంటెంట్ వర్డ్స్ ద్వారా మనం గ్రహించే విషయాన్ని ఏ పద్ధతిలో/ దిశలో వివరించాలో నిర్దేశకాలు చెపుతాయి.



నూతక్కి విజయశేఖర్


సమాధానాన్ని ఏ పరిమితుల్లో ఉంచాలో నిర్దేశించే పదాల్లో డైరెక్టివ్‌తోపాటు నియమిత కాలం/ సంవత్సరం లాంటివి మరికొన్ని.

✤ 'కార్గిల్ యుద్ధం తరువాత భారత రక్షణ విధానంపై వ్యాఖ్యానించాల'ని (కామెంట్) అడిగితే: 1999లో కార్గిల్ యుద్ధం జరిగింది కాబట్టి అంతకు ముందు రక్షణ అంశాల జోలికి పోకూడదు.

✤ కార్గిల్ యుద్ధాన్ని సరిహద్దుగా ఇస్తూ దానికి ముందు, తర్వాత రక్షణ విధానాలను పోల్చమని గానీ, మారిన రక్షణ విధానాన్ని జస్టిఫై (సరైనదే అని నిర్ధారించడం) చెయ్యమని గానీ అడిగితే- అప్పుడు కార్గిల్ యుద్ధం ముందరి సంఘటనలను అవసరమైనమేరకు ప్రస్తావించకపోవడం తప్పవుతుంది.

'నిర్దిష్ట సంఖ్యా పదాల్లో సమాధానం' అన్నది కూడా పరిమితిని నిర్దేశిస్తుంది.

సమాధానం పరిమితిని నిర్దేశించేవి 'లిమిటింగ్ వర్డ్స్'. ఈ పదాలు కొన్ని స్పష్టంగా ఉంటే మరి కొన్ని పరోక్షంగా ఉంటాయి. ఇచ్చిన అంశం గురించి తెలిసిందంతా కుమ్మరించకుండా ఇవి పరిమితి విధిస్తాయి.



ఎలాంటివి లిమిటింగ్ వర్డ్స్‌గా ఉండవచ్చంటే:

**కాలం:** నిర్దిష్ట సంవత్సరం, కాల పరిమితి (గత దశాబ్దంలో, ఇరవయ్యో శతాబ్దం చివర, పాత రాతియుగం, bring out circumstances in 2005... ).

**స్థలం:** ఈశాన్య ప్రాంతం, పాక్ సరిహద్దు, ఆగ్నేయాసియా, మధ్య ప్రాచ్యం ...

**ప్రజా సమూహాలు:** మహిళలు, వృద్ధులు, 6- 11 సంవత్సరాల వయసు పిల్లలు, వ్యవసాయ కూలీలు, కింది వర్గాల ప్రజలు, బైపీసీ విద్యార్థులు...

**విస్తృతి:** నిర్దిష్ట ఏరియా, యూనివర్సిటీ విద్య, సముద్ర తీరం, నూతన ఆర్థిక విధానాలు...

వివిధ నిర్దేశకాలకు సమాధానం ఎలా ఇవ్వాలో ఉదాహరణలతో సాధన చేయాలి. ఎన్ని ఎక్కువ టాపిక్‌లతో సాధన చేస్తే అంత ఎక్కువ ఉపయోగం. ఒకే టాపిక్‌ను వివిధ నిర్దేశకాలతో సాధన చేయగలిగితే ఇంకా ఉపయోగం (అయితే ప్రతి అంశానికీ మనకు తెలిసిన డైరెక్టివ్స్ అన్నీ వర్తించాలన్న నియమం లేదు). సాధన చేయకుండా ఇలా రాయాలి అని మనసులో అనుకుని పరీక్ష హాల్లోకి ప్రవేశిస్తే, ప్రశ్నపత్రం చూశాక తెల్లమొహం వేయాల్సి వస్తుంది. సాధ్యమైనన్ని తక్కువ పదాల్లో వీలయినంత ఎక్కువ విషయాన్ని ఎలా ఇమడ్చవచ్చో సాధన ద్వారానే అనుభవపూర్వకంగా తెలిసివస్తుంది. 'సాధనమున పనులు సమకూరు ధరలోన' అన్న వేమన పద్యం తెలిసిందే కదా!

## సందర్భశుద్ధి తప్పనిసరి

సమాధానం అంతటిలోనూ సందర్భశుద్ధి (relevance) పాటించడం తప్పనిసరి నియమం. ఈ నియమం ప్రతి డైరెక్టివ్‌కూ వర్తిస్తుంది. ఒక్కోసారి ప్రశ్నలో నేరుగానే సందర్భాన్ని ప్రస్తావిస్తారు. In the light of, in this background, with reference to మొదలైన పద బంధాలు సందర్భాన్ని సూచించేవే. ఇవి 'కాంటెక్స్ట్ వర్డ్స్'. ఇలాంటిచోట్ల సందర్భాన్ని దాటిపోవడం ఎంత మాత్రం వాంఛనీయం కాదు. ఈ విధంగా ఇచ్చే సందర్భాలు నిర్దిష్ట డైరెక్టివ్స్‌లో మాత్రమే ఇస్తారన్న నియమం లేదు. టాపిక్‌ను బట్టి ఏ నిర్దేశంలోనైనా ఇవ్వొచ్చు. ఇచ్చిన అంశంపై తగిన అధ్యయనం చేసి ఉన్నట్లయితే సందర్భం పరిమితుల్లో సమాధానం ఇవ్వడం ఇంకా తేలికవుతుంది.

ఒక ప్రశ్నలో ఒకే పదం లిమిటింగ్ వర్డ్‌గానూ, కాంటెక్స్ట్ వర్డ్‌గానూ కూడా ఉండవచ్చు. వేగంగా, సులభంగా, గరిష్ఠ మార్కులు పొందే విధంగా సమాధానం ఇవ్వగల నేర్పు సంపాదించడానికే ప్రశ్నను ఇన్ని కోణాల్లో చూడడం! ఈ సూత్రాలకు అనుగుణంగా సాధన చేస్తే పరీక్షల్లో వెతుక్కోకుండానే ఆశించిన సమాధానం ఇవ్వగల సామర్థ్యం సమకూరుతుంది.

అధ్యయనం 5

## విశ్లేషించండి... అంటే?

ప్రశ్నలో 'ఎనలైజ్' అన్నపుడు ఇచ్చిన అంశంలోని ఉపఅంశాల గురించిన లోతైన అవగాహననూ, ఉప అంశాల మధ్య ఉండే పరస్పర సంబంధాలపై అవగాహననూ సాధారణంగా పరీక్షిస్తారు. ఒక అంశంలోని ఉప అంశాలన్నింటినీ గుర్తించి, వాటి మధ్య సంబంధాలను, ఆ సంబంధాల స్వభావాన్ని విశ్లేషించగలిగితే? అప్పుడు ఒక సమస్యను దానితో ముడిపడివున్న అన్ని వర్గాలకు (all stake holders) ఆమోదయోగ్యంగా పరిష్కరించగల సామర్థ్యం వస్తుంది. అరకొరగా సమస్యను చూస్తే తద్వారా వచ్చే పరిష్కారం కొందరికి మోదం, మరికొందరికి ఖేదం మిగులుస్తుంది. ఇది మంచి పాలనావేత్తల లక్షణం కాదు కదా!

'విమర్శనాత్మకంగా విశ్లేషించండి' అన్నపుడు ఉప అంశాల బలాబలాలనూ, సాంద్రతనూ బేరీజు వేస్తూ మన వాదనకు చివరలో నిష్పాక్షికమైన ముగింపు ఇవ్వాలి. వాదనలోనే లేదా ఉప అంశాల వివరణలోనే నిష్పాక్షికత ఉండేట్లు చూసుకుంటే ముగింపు/ పరిష్కారం/ తీర్పు కూడా నిష్పాక్షికంగా ఉండే అవకాశం ఉంటుంది.

**ఈ కింది ప్రశ్న చూడండి:**

What are the different types of agriculture subsidies given to farmers at the national and at state levels? Critically analyse the agricultural subsidy regime with reference to the distortions created by it. (200 words)

రైతులకు జాతీయ, రాష్ట్ర స్థాయుల్లో ఇస్తున్న వివిధ రకాల వ్యవసాయ సబ్సిడీలు ఏమిటి? వ్యవసాయ సబ్సిడీల ప్రభావాన్ని అవి సృష్టించిన అపభ్రంశాల నేపథ్యంలో విమర్శనాత్మకంగా విశ్లేషించండి.

ఈ ప్రశ్నలో ప్రధాన అంశం వ్యవసాయ సబ్సిడీలు, అవి కలిగించిన అపభ్రంశాలు. అయితే ఈ ప్రశ్న రెండు భాగాలుగా ఉంది. ప్రశ్నార్థకానికి ముందున్నది ఒక భాగం. ఆ తర్వాత ఉన్నది మరొక భాగం. నిర్దేశకం రెండో భాగానికి తప్ప మొదటి భాగానికి వర్తించదన్న అభిప్రాయం కలిగించేదిగా ఉంది. కానీ మొదటి భాగంలోని 'వ్యవసాయ సబ్సిడీలు' అంశాన్ని ఉప అంశాలుగా విడదీస్తే 200 పదాల కంటే పెద్ద సమాధానం అవుతుంది. కానీ 'అపభ్రంశాల నేపథ్యంలో' అన్న లిమిటింగ్ వర్డ్‌కు అనుగుణంగా మొదటి భాగానికి సమాధానం ఇస్తే ఆశించిన సమాధానం వస్తుంది. పరిశీలనగా చూస్తే డైరెక్టివ్ కూడా సమాధానం విస్తృతిపై పరిమితి విధించినట్లు అర్థమవుతుంది.

పైన ఇచ్చిన వివరణ కోణంలో చూస్తే.. ప్రశ్నలో

✤ **కంటెంట్ వర్డ్స్:** different types, agriculture subsidies, distortions ✤ **లిమిటింగ్ వర్డ్స్:** with reference to, 200 words. ✤ **కాంటెక్స్ట్ వర్డ్:** distortions created by it. ✤ **డైరెక్టివ్:** Critically analyse

(ఈ సమాధానం ఎలా రాయవచ్చు? ... వచ్చే సంచికలో)

రచయిత 'జాతీయ అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణ' సైట్ *www.teluguvartalu.com* నిర్వాహకులు.